# చీకటి వెలుగులు

శ్రీ . జ సుబ్బారావు

తెల్లవారుఝామున ఎప్పుడో విశాఖలో బయలుదేరిన ప్యాశింజరు విజయవాడ చేరుకునేసరికి రాత్రి ఏడు గంటలైంది. గుంటూరుబండి వెళ్లి అప్పటికే గంట అయిందట. మళ్లీ బండి ఎనిమిదిన్నరకుగాని లేదు. చేసేదిలేక వెయిటింగురూంలోకి వెళ్లి బాత్‌రూంలో ముక్కు ముఖం కడుక్కొని కాన్‌టీన్‌లో ఇన్ని కాఫీ నీళ్లు గతికి హిగ్గిన్‌బాతమ్స్ దగ్గరకువచ్చి నిలబడ్డాను.

స్టేషనంతా నియాన్‌లైట్ల నీలి వెలుగులో తేలిపోతోంది. ప్రయాణికులు హడావుడిగా పెట్టె బెడ్డింగులు చేతపట్టుకొని రైలు పెట్టెలవెంట పరుగులిడుతున్నారు. పనిలేని యువతీ యువకులు పనిఉన్న పెద్ద మనుష్యుల్లా ప్లాట్‌పారంమీద పచార్లు చేస్తున్నారు.

ఎవరిదో పర్సుపోయింది. గట్టిగా గోల పెట్టుతున్నాడు. చుట్టూచేరిన జనం అతన్నే తిట్టుతున్నారు.

"అంత అజాగ్రత్త అయితే ఎలా?"

"బుద్ధిలేకపోతే సరి పక్కజేబులో పెట్టుకుంటారా?"

"బెజవాడని తెలీదూ?"

"ఇక్కడ ఏడిస్తే ఏం ప్రయోజనం? చప్పున పోయి పోలీసు రిపోర్టు ఇవ్వు."

"అదొక తద్దినం దేనికి? డబ్బుపోయి శని పట్టుకున్నట్లు!"

తలొకమాట. తలొక బాట. తల తిరిగిపోతోంది అతనికి.

"ఏమిటా పెళ్లినడక? త్వరగా ఏడు?" ఇంగీషు చదువుకున్న యువకుడు అదిలిస్తున్నాడు రెండేళ్ల పాపను ఎత్తుకొని కట్టుకున్న సరికొత్త చీరె కాళ్లకు బందాలేస్తుంటే అడుగు పడక తడబడుతున్న భార్యను.

"మూర్ఖుడు" అనుకున్నాను.

గుంటూరు బండి మరో పది నిమిషాలలో బయలుదేరపోతున్నట్లు లౌడ్‌స్పీకర్ హెచ్చరించింది. నేను ఉలిక్కిపడి గుంటూరులైనువైపు పరుగెత్తాను.

సేను సెకెండ్‌క్లాసు పెట్టెలోకి ఎక్కబోతుంటే "ఇది గుంటూరువెళ్ళే బండేనాండీ?" శావ్యమైన కంఠంవిని వెనుదిరిగి చూచాను. అందమైన యువతి. చేతిలో ఆకుపచ్చని పాస్టిక్ బుట్ట.

"అవును. త్వరగా ఎక్కండి. బండి కదలబోతోంది" తొందర చేశాను కొంచెం ప్రక్కకు తప్పుకుంటూ. ఆమె లోపలికి వెళ్లబోయి ఎందుకో క్షణం తటపటాయించింది.

"త్వరగా లోపలికి వెళ్లాలి. బండి కదలబోతోంది." నా హడావుడిలో నేను హెచ్చరించాను. ఆమె చరచరా లోపలికి వెళ్లింది. నేను ఆమెను అనుసరించాను.

కంపార్టుమెంటు ముందుగదిలో ముగ్గురు ఉన్నారు. వెనుక గదిలో ఒకమూలగా బుట్టపెట్టుకొని ఆమె కూర్చున్నది. ఆమె కెదురుగాఉన్న బల్ల మీద నా ఎయిర్‌బాగ్ పెట్టుకొని కిటికీకి ప్రక్కగా కూర్చున్నాను.

ఆమె ఎటో చూస్తోంది. ఏదైనా కల్పించుకొని మాట్లాడటానికి మనసు మారాం చేస్తోంది. కానీ మాట పెగిలి రావటంలేదు. నిశ్శబ్దం అసహ్యంగా వూగులాడుతోంది.

"ఎక్కడకు వెళ్తున్నారు?" ఆమే చొరవ చేసింది ఒక నిమిషం తర్వాత. చదువుకున్నదిలా వుంది.

"గుంటూరు" అన్నాను ముక్తసరిగా.

"ఏం చేస్తుంటారు?" మళ్లీ ఆమె అడిగింది క్షణం నిశ్శబ్దం తర్వాత చేతి వాచి చూస్తూ.

"బడివంతులు పని" అన్నాను నీరసంగా.

ఆమె మెల్లగా నవ్వింది. నేను కుంగిపోయాను.

మళ్లీ నిశ్శబ్దం. ఆమె అటువైపు ముఖం పెట్టి చూస్తోంది. ఉన్నట్టుండి ఏదో జ్ఞాపకం వచ్చిన దానిలా ఉలిక్కిపడి అటు ఇటూ వెదకటం మొదలు పెట్టింది కంగారుగా.

"ఏమండి? ఏమైంది?" అడిగాను.

"పర్సు...... ఎక్కడో జార విడిచాను." అన్నది నీరసంగా.

"ఆ బుట్టలో పెట్టారేమో!" అన్నాను బుట్టకేసి చూస్తూ.

"అబ్బే. లేదండి.... వెయింటింగ్ రూంలో కాఫీ త్రాగి డబ్బులు తీసి ఇచ్చాను....అవును.. అక్కడే పడేసి ఉంటాను..." జ్ఞప్తికి తెచ్చుకుంటూ అన్నది. "క్షమించాలి. ఇప్పుడే వస్తాను. కాస్త ఈ బుట్టను చూస్తుంటారూ?" ప్రాధేయపూర్వకంగా అడిగింది.

"మీరంత ప్రాధేయపడ నవసరం లేదు. కానీ బండి టైము అవుతున్నది." అన్నాను వాచ్ చూస్తూ.

"ఫర్వాలేదు. చప్పున తిరిగి వస్తాను." అంటూ అడుగు ముందుకు వేసింది. మళ్లీ వెనక్కు తిరిగి "భద్రంగా చూస్తుంటారు గదూ." అంటూ గబగబా నడిచింది బుట్టవైపు ఒకసారి, నావైపు ఒకసారి చూసి.

"బండి కదిలేత్తేనో ?" అంటూ వెంబడించాను గుమ్మందాకా.

"మీరుండగా నాకేం భయం?" భారంగా నవ్వింది. జాలిగా చూసింది బండి దిగుతూ.

నేను అర్థంలేని నవ్వు తెచ్చుకొన్నాను.

ఆమె ప్లాట్‌పారం మీద పరుగెత్తుతున్నట్లు నడుస్తుంటే నా చూపులు ఆమెనే అనుసరించాయి. ఆమె బ్రిడ్జి ఎక్కి మలుపుతిరిగి జనంలో కలసి పోయింది.

గార్డు ఈలవేశారు. ఇంజన్ గంయ్‌మని అరిచి నిప్పులు కక్కుకుంటూ బయలుదేరింది.

నాకు కంగా రెక్కువైంది. గుండె వేగంగా కొట్టుకోటం మొదలుపెట్టింది. ప్లాట్‌ఫారం వెనక్కి పోతుంటే కొంగలా మెడ సాచి బ్రిడ్జివంక చూస్తున్నాను అయోమయంగా.

రైలు శబ్దం చేసుకుంటూ కృష్ణానది దాటింది. గట్టిగా నిట్టూర్చి నా సీటువైపు నడిచాను.

ముందు గదిలో కూర్చున్న ముగ్గురు వ్యక్తుల్లో ఖద్దరుధారులైన ఇద్దరు పెద్దలు ఒకే సీటుమీద కూర్చుని రాజకీయాలు పేలగొడుతున్నారు. మూడవ వ్యక్తి యువకుడు. మూపైన కంటే ఉండవు. వాళ్లకు ఎదురుగా ఉన్న బెర్తు చివరగా కూర్చొని ఏదో మిస్టరీ నవల కాబోలు చదువుతున్నాడు. నేను నా సీటులోకి వెళ్తుంటే నన్ను చూడనట్లే చూచి మళ్లీ పుస్తకంలో మునిగిపోయాడు.

రైలు కదలబోతోందని చెప్పినా వినకుండా వెళ్లింది. ఆ బుట్టలో ఆమె ప్రాణం ఏం దాచుకున్నదో గాని పదే పదే హెచ్చరించింది. అంత ముఖ్యమైనదైతే వెంట తీసుకెళ్లగూడదూ ? పాపిష్టివాడిని పేరైనా తెలుసుకోలేదు. ఇప్పుడు ఈ బుట్టనేం చేయాలి ?

మంగళగిరిలో దిగి పెట్టెలన్నీ వెదికి వచ్చాను. నా పిచ్చిగాని, ఆమె ఎందుకుంటుంది? చిత్తభ్రమణ తప్ప !

ఇంజన్ పొలికేక పెట్టి వెనక్కు ముందుకు గింజుకొని ఒక్క ఉదుటన దూకింది. బుట్ట బోల్తా కొట్టి మూలిగింది.

నేను బిత్తరపోయాను. కొంపదీసి ఏ కోడో కుక్కో కాదు గదా !

మెల్లగా బుట్టనెత్తి పైగుడ్డను తీశాను.

కలా ? కథా ? కామినీ మాయా ?

కళ్లు నల్చుకుని మరీ చూచాను.

మెత్తటి పొత్తిళ్లలో మాంసం ముద్దలాగున్న మానవుని పసి గుడ్డు !

నాకు ఊపిరి ఆగింది క్షణం. ముచ్చెమటలు పోశాయి శరీరమంతా.

ఆరున్నొక్కరాగం అందుకొంది పసి గుడ్డు.

"ఏమిటండీ, బిడ్డను అలా ఏడిపిస్తున్నారు ?" అంటూ ఇద్దరు పెద్దమనుష్యులు వచ్చారు.

నాకు మాట తడబడింది. గొంతులో తడి ఆరిపోయింది. ఒకసారి పసికూనవంక, మరొకసారి వారిద్దరి వంక మార్చి మార్చి చూచాను అయోమయంగా.

"అలా చూస్తారేమండి ? పిల్లకు ఏమైంది ? తల్లి ఎక్కడ ?" లావుపాటి పెద్దమనిషి ప్రశ్నల వర్షం కురిపిస్తున్నాడు.

"అదేమిటి ? ఆ బుట్టలో పడుకోబెట్టారు ? వింతగా ఉన్నదే మీ పద్ధతి ? తీసి ముందు ఎత్తుకోండి. ఊపిరాడక ఇదయ్యేను." రెండవ వ్యక్తి మందలించాడు.

"మీకే చెప్తూంట. గుక్కపెట్టి ఏడుస్తుంటే రాతిబొమ్మలా నిలబడతారేం ?" మొదటి మనిషి.

పసిపిల్లలంటే నాకు భయం. దగ్గరికే చేరను. అనవసరంగా గుడ్డలన్నీ ఖరాబు చేస్తారు. ఇప్పుడు ఈ పొత్తిళ్లలోని గుడ్డును ఎలా ఎత్తుకోటం ?

పాప రోదనకు కంపార్టుమెంటు ప్రతిధ్వనిస్తోంది. బుట్టలోని గుడ్డు మెలికలు తిరిగిపోతోంది. మరికొంతసేపు అలానే చూస్తుంటే వాళ్లు నా ఎముకలు సున్నం చేసేమాట నిజం. బిక్కమొహం పెట్టి ఇబ్బందిగా ఎత్తుకున్నాను, పొయ్యిమీద గిన్నెను తీస్తున్నట్లుగా.

"అదేమి ఎత్తుకోట మండోయ్ ? రెక్కలూడి వచ్చేను ! అలాగాదు. గుడ్డల్లో పెట్టి అడ్డంగా ఎత్తుకోండి." ఎత్తుకుండే విధానం రెండవ పెద్దమనిషి నాకు నేర్పాడు.

"ఇంతకూ తల్లి ఎక్కడకు పోయింది ?" లావుపాటి పెద్దమనిషి మళ్లీ అందుకున్నాడు.

"తల్లా ?" గొణిగాను.

"అవునండి. కలసే ఎక్కారుగా. ఏమైంది ఇప్పుడు ?"

"ఇందాక దిగి వెళ్లినట్లుంది." రెండవ వ్యక్తి బుర్ర నుపయోగిస్తున్నాడు.

"పిల్లను వదలి ఎలా దిగి వెళ్తుందండి!" ఆశ్చర్యబోయాడు.

"ఏమో. ఏం కీచులాడుకున్నారో, మరి. మన గొడవలో మనం ఉన్నాం."

"కీచులాడుకుంటే మాత్రం బిడ్డను వదిలి పోతుందా ? ఆమె ఆడదేనా ?"

"మీ రొకటి గ్రహించాలి. పిల్లను గూడా వదలి వెళ్లిందంటే ఆయన ఎంత క్రూరంగా నీచంగా ప్రవర్తించి ఉంటాడో అర్థమౌతూనే ఉంది. అనవసరంగా ఆ యిల్లాలిని అంటూ రెందుకు ?" నన్ను నమిలి మింగేంతగా చూచాడు రెండవ వ్యక్తి.

"మీరు లక్ష చెప్పండి. అసలు ఆడదాన్ని హద్దుల్లో ఉంచకపోతే వచ్చే అనర్థకాలే ఇవి." నన్ను ఉరిమి చూచాడు లావుపాటి పెద్దమనిషి.

వ్యవహారం ముదురుతోంది. నన్ను ఆమె భర్తగా గుర్తించటమే గాక రాక్షసుడ్నిగా ఒకరు చిత్రిస్తే, కేవలం చచ్చు దద్దమ్మగా మరొకరు నిరూపిస్తున్నారు. ఈ కథ ఇలా సాగనిస్తే అంత్యం ఎలా ఉంటుందో చెప్పడం కష్టం. అందుకని జరిగిన సంగతి జరిగినట్లు చెప్పాను.

వాళ్ల నోళ్లు ఒకేసారి గాబుల్లా తెరుచుకున్నాయి !

"అయితే ఆమె మీ భార్య కాదన్నమాట! " ఆవులించాడు లావుపాటి వ్యక్తి.

"అప్పుడే అనుకున్నాను ఆ తరహా చూచి. కానీ ప్రక్కన మీ ముఖం చూచి ఏమోలే అనుకున్నాను." రెండవ వ్యక్తి.

"ఊటిముండ. ఎంత పని చేసింది ?"

"కులట. ఎన్ని కొంపలు గూల్చిందో."

ఇదంతా పుస్తకం చూస్తూ గమనిస్తున్న యువకుడు తటాలున లేచి "క్షమించాలి. మీరు పొరబడుతున్నా రనుకుంటూ. త్వరబడి ఒక నిర్ణయానికి రావడం మంచిదికాదేమో" అన్నాడు విసురుగా.

మేం ముగ్గురం విస్తుబోయి చూచాం.

"ఏమిటి మీ రనేది ?" మొదటి వ్యక్తి అన్నాడు తెప్పరిల్లి.

"అనవసరంగా పరాయి ఆడవారిని ఆడిపోసుకోవద్దని."

"అంటే ఆమె పెద్ద పతివ్రతంటారా ?" వికటంగా నవ్వారు.

"కావచ్చు. కాకపోవచ్చు. అది వేరే సంగతి."

"కాదు. అది సంఘానికి సంబంధించిన విషయము. వ్యక్తి పతనం చెందితే సంఘం గూడా అంతే."

"నిజం. కానీ, కోరి ఎవరూ నేరం చేయరు. అందుకు బలవత్తర కారణాలు ఏవో ఉంటాయని

అనుకుంటాను. పరిస్థితుల ప్రాబల్యం వలన మనిషి ఎంత నీచానికైనా దిగజారవచ్చు. కాదనను. కానీ వాటిని సానుభూతితో పరిశీలించి అర్థం చేసుకొని సహనంతో పరిష్కరించటం విజ్ఞుల లక్షణం. కారకు లను పట్టి శిక్షించడం శ్రేయస్కరం."

"కారకు లెవ రంటారు ?"

"కులం గోత్రం, బీదా గొప్ప, కట్నం గట్రా అంటూ అడ్డంకులుపెట్టి ఆనకట్టలు కట్టి అమాయక హృదయాలను పిండుకు తినే మీలాంటి పెద్దలు." ఆవేశంతో అరిచాడు యువకుడు. చప్పున తన్ను తాను సంబాళించుకొని "క్షమించాలి అనవసరంగా కల్పించుకొని ఆవేశంలో ఏదో అనేశాను. వ్యక్తిగతంగా మిమ్మలను ఉద్దేశించి అనలేదు. ఆమెను చూస్తే ఎందుకో మీతో ఏకీభవించలేక పోయాను. అంతే." అన్నాడు కూర్చొంటూ.

"ఊఁ .... గుడ్డు వచ్చి పిల్లను ఎక్కిరించిందట. నాకు పాఠాలు నేర్పుతున్నావే? మధ్య నీ కెందుకు బాబు, అంత ఉలుకు ?"

"నాకా .... నా కెందుకు ....." గొణిగాడు.

"ఈ రోజుల్లో కుర్రాళ్లకు ఆవేశం తప్ప ఆలోచనే లేదు." రెండవ వ్యక్తి అందుకున్నాడు.

"మా బాగా చెప్పారు." చుట్ట వెలిగిస్తూ వంత పాడాడు మొదటి వ్యక్తి.

యువకుడు మారు మాట్లాడలేదు. పుస్తకంలో తలదూర్చి కూర్చున్నారు.

తర్వాత పెద్ద లిద్దరి సంభాషణ చదువుకున్న అమ్మాయిలు, సినిమాల ప్రభావం, స్త్రీకి సమాన హక్కులు వగైరాల మీదగా నడిచి కాంగ్రెస్ ప్రభుత్వం మీదకు విరుచుకు పడింది.

ప్రస్తుతం నా సమస్య వేరు. ఈ పసి గుడ్డును ఏం చేయాలో తెలియటం లేదు. చేతుల్లో బిడ్డ నిలవటంలేదు.

పెద్దల సలహా ఆశించాను.

"తగలెయ్యండి." నోట్లోనుంచి చుట్టతీసి తుపుక్కున ఉమ్మేశాడు లావుపాటి పెద్దమనిషి.

యువకుడు గాభరాగా చూచాడు.

నేను అసహ్యించుకున్నాను మనసులో. పిల్ల ఏడుస్తుంటే ఎత్తుకునేదాకా నన్ను బ్రతకనివ్వలేదు. ఆ పెద్దమనిషేనా ఈయన ? ఈ గుడ్డు అప్పుడు చేయని నేరం ఇప్పుడేం చేసింది ?

"ఎందుకొచ్చిన పీడగాని, పోలీసులకు అప్పగించండి." రెండవ వ్యక్తి సలహా పారేశాడు.

"పోలీసులకా ?" భయాందోళనలతో గొణిగాడు యువకుడు.

"కాకపోతే ఎవరు మూటకట్టు కెళ్తారయ్యా ఈ మహా పాపాన్ని." మొదటి వ్యక్తి కండువా దులిపి మీద వేసుకున్నాడు..

"పోనీ, మీరు తీసుకెళ్లండి అంత జాలిగా ఉంటే. ఆమె అంటే అభిమానం గూడా చూపుతున్నట్లున్నారు !" అన్నాడు అదోకలా చూస్తూ రెండవ వ్యక్తి.

"నేనా ?" యువకుడు ప్రశ్నించుకున్నాడు.

తల కిటికీలో పెట్టి మౌనంగా చీకట్లోకి చూస్తున్నాడు. నిప్పు రవ్వలు నింగిలోకి ఎగురుతో నిశిలో మసి అయిపోతున్నాయి.

గుంటూరులో దిగగానే పోలీస్ స్టేషన్ వైపు బయలుదేరాం. ఆ పరిస్థితిలో అంతకంటె మార్గం మరొకటి తోచలేదు.

యువకుడు ఎందుకో అస్థిమితంగా అటు ఇటు తచ్చాడుతున్నాడు. కొంతదూరం పోయి వెనక్కు వచ్చాడు.

"నిజంగానే పోలీసులకు అప్పగిస్తున్నారా ?" అడిగాడు మెల్లగా నా దగ్గరకు చేరి.

"ఏం ?" అన్నాను.

"ఏమీ లేదు. వూరికే. తెలుసుకుందామని" గొణిగాడు తిరిగివెళ్తూ.

మేం ఒకరి ముఖాలు ఒకరు చూచుకున్నాం.

మరి నాలుగడుగులు వేసిన తర్వాత మళ్లీ వచ్చి "నిజంగానే అప్పగిస్తారా ?" అడిగాడు ఆవేదనతో.

నేను అతని కళ్లల్లోకి చూచాను సూటిగా. అతను ముఖం త్రిప్పుకున్నాడు.

ఆ ప్రశ్న అతను అడిగినట్లు లేదు. ఆమె బండి దిగుతూ అన్న మాటలు, చూచిన చూపు జ్ఞప్తి కొచ్చి హృదయం కలవర పడ్డది.

నామీద నాకే అసహ్యం వేసింది. ప్రేమ, దయ, దాక్షిణ్యాల గురించి పిల్లలకు పాఠాలు చెప్తాను. వాటిని అలవరచుకోమని బోధిస్తాను. కాని నేను చేస్తున్న పని ఏమిటి ? నన్ను నమ్మి నాకు అప్పగించబడిన ఈ బిడ్డను—పరోక్షంగానే కావచ్చు—నిర్దయతో పోలీసులకు అప్పగించబోతున్నాను. పోలీసులు రక్షక భటులే కావచ్చు. కానీ సుశిక్షితులు నిస్వార్థపరులు, నిజాయితీపరులు, ధర్మపరులు వారిలో చాలా అరుదు.

"మన్నించాలి. మీ రెవరో నాకు తెలియదు. కాని నాకు విజ్ఞానం ప్రసాదించారు. మరుగు పడిన మానవత్వాన్ని పైకితీశారు. ఈ బిడ్డను నేను తీసు కెళ్తాను. పెంచుకుంటాను. మీరు బాధపడకండి." అన్నాను.

యువకుడు నిశ్చేష్టుడైనాడు. మిగతా ఇద్దరూ నాకు పిచ్చి పుట్టిం దనుకున్నారు.

"క్షమించాలి. మీరు యోగ్యులు. కరుణా మయులు. మీ నిర్ణయం నా మైకాన్ని తొలగించింది. కర్తవ్యం ప్రబోధించింది. నా బిడ్డలా చూసు కుంటాను. నేనే తీసుకెళ్తాను." అన్నాడు చేతులు బిడ్డవైపు చాచుతూ యువకుడు.

"మీరా ?" అన్నాను ఆశ్చర్యంగా.

"అవును. కన్న తండ్రిలా పెంచుతాను. వీలైతే ......తల్లిని....."

"ఎరుగున్నారా ?" మధ్యలోనే అడిగాను.

"ఇప్పుడు చూచానుగా బండిలో" అంటూ పాపను తీసుకున్నాడు నా చేతుల్లోనుంచి. మంత్ర ముగ్గలా పాప ఏడుపు మానింది.

"చూశారా. నేను ఎత్తుకోంగానే ఎలా బుద్ధి మంతురాలైందో?" అన్నాడు నవ్వుతూ నావంక చూస్తూ.

నేను ఈ వింత మనిషిని పోల్చుకోటానికి ప్రయత్నిస్తున్నాను.

"ధీరియో. వస్తాను. మీ మేలు మరవ లేను." అంటూ జనంతో కలసిపోయాడు యువకుడు.

నీ నగవులు నీ చూడ్కులు
నీ నానా విహరణములు నీ ధ్యానంబుల్
నీ నర్మాలాపంబులు
మానసమున నాటి నేడు మగుడవు కృష్ణా !

(పోతన—భాగ—గోపికాగీత.)